'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## అగ్నికి ఆజ్యం

**రష్యా-ఉక్రెయిన్** పోరు ప్రపంచ యుద్ధంగా మలుపు తిరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అణ్వస్త్ర యుద్ధంగానూ పరిణమించే ప్రమాదమూ పొడసూపుతున్నది. తృటిలో ముగుస్తుందన్నట్టుగా మొదలైన ఈ యుద్ధం సుదీర్ఘంగా సాగుతూ వెయ్యి రోజులు పూర్తిచేసుకున్నది. సరిగ్గా ఆ సందర్భంలోనే ఆందోళనకర ఘటనలు చోటుచేసుకున్నాయి. అమెరికా తాను ఇదివరకే సరఫరా చేసిన దీర్ఘలక్ష్య క్షిపణులను (అటాకెమ్స్) రష్యా భూభాగాల మీద ప్రయోగించేందుకు అనుమతించింది. మొన్నటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన డెమొక్రాటిక్ పక్షానికి చెందిన జో బైడెన్ అవసాన పదవీకాలంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం. ఇప్పటివరకూ ఉక్రెయిన్ వీటిని రష్యా ఆక్రమిత క్రిమియా వంటి ప్రాంతాలపైనే వేసింది. ఇప్పుడు నేరుగా రష్యా భూభాగం మీద వేసేందుకు అమెరికా పచ్చజెండా ఊపడం, ఉక్రెయిన్ తెగించడం పెద్ద విషయమే. అదే అదనుగా రష్యా మీదకు ఉక్రెయిన్ ఆరు క్షిపణులను ప్రయోగించింది. సహజంగానే రష్యాకు ఈ వ్యవహారం కోపం తెప్పించింది. పశ్చిమ దేశాలు యుద్ధాన్ని 'కొత్తదశ'కు తీసుకెళ్లాయని మండిపడ్డ రష్యా అణ్వస్త్రాల వినియోగంపై నియంత్రణలను సడలించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు అణ్వస్త్రాల వినియోగ విధివిధానాలపై అధ్యక్షుడు పుతిన్ తాజా ఉత్తర్వులు జారీచేసినట్టు వార్తలు వస్తున్నాయి.

అమెరికా తదితర దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయడాన్ని యుద్ధంలో నాటో ప్రత్యక్షంగా పాల్గొనడంగా పరిగణిస్తామని రష్యా ఇదివరకే హెచ్చరించింది. తాజాగా అనేక ఇతర ఆయుధాలతో పాటుగా మందుపాతరలను కూడా సరఫరా చేసేందుకు అమెరికా ముందుకురావడం మరో కీలక పరిణామం. వైమానిక దాడులు జరుగుతాయనే సూచనలతో కీవ్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని మూసివేశారన్న వార్తలతో అటు పశ్చిమ యూరప్ దేశాల్లో యుద్ధ భయం వ్యాపిస్తుండటం మనం గమనించవచ్చు. ఈ ఘటనల క్రమంపై సహజంగానే ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఫ్రాన్స్, బ్రిటన్ కూడా ఉక్రెయిన్‌కు క్షిపణులు సరఫరా చేసినప్పటికీ రష్యా భూభాగంపై వాటిని ప్రయోగించేందుకు ఇంతవరకు అనుమతి ఇవ్వలేదు. రష్యాను దెబ్బతీసేందుకు తమ వద్ద గల అన్ని శస్త్రాస్త్రాలను ఉపయోగిస్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హెచ్చరిస్తుండటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాల్సి ఉన్నది.

నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో రెండోసారి అధ్యక్షునిగా ఎన్నికై వచ్చే జనవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపాలనే సంకల్పాన్ని వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అందుకు అమెరికా ఆయుధ సరఫరా నిలిపివేసి, అవసరమైతే ఉక్రెయిన్ ఒక మెట్టు దిగేలా చేసి సంధి కుదుర్చాలనేది ఆయన ఆలోచన. సంధి కోసం ఆక్రమిత భూభాగాలను రష్యాకు వదిలేసేటట్టు ఒప్పిస్తానని కూడా ట్రంప్ సూచనలు వెలువరించారు. ఈ పరిస్థితుల్లో పదవీకాలం దాదాపు ముగింపునకు వచ్చిన జో బైడెన్ యుద్ధాన్ని ఎగదోసే నిర్ణయం ఎందుకు తీసుకున్నారనేది పెద్ద ప్రశ్న. ఆయుధ తయారీ రంగం తరపున ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు అంతకంతకూ పెరుగుతున్నాయి. గతంలో ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాకు సంబంధించి బైడెన్‌పై ఆరోపణలు రావడమే అందుకు కారణం. ట్రంప్ శాంతి యత్నాలకు ఆయన అధికారంలోకి రాకముందే గండి కొడుతున్నారనే వాదనలు ప్రస్తుతం జోరందుకుంటున్నాయి. ప్రపంచపెద్దగా విర్రవీగే అమెరికాకు యుద్ధోన్మాదులతో ఈ తరహా దోబూచులాటలు ఏ మాత్రం శోభించవు. మూడో ఏడాదిలోకి ప్రవేశించిన యుద్ధాన్ని ఆపేందుకు చిత్తశుద్ధితో కృషి చేయడం తక్షణావసరం. అగ్ర రాజ్య పెద్దలు ఈ సంగతి గుర్తిస్తే మంచిది.

# మత్స్యకారుల్లో నాటి ముసిపేమేది?

పిట్టల రవీందర్
99630 62266

**మౌలిక సమస్యల లోతుపాతులను సుదీర్ఘకాలం పాటు అధ్యయనం చేసి, వాటిని అవగాహన చేసుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యల పరిష్కారానికి సరైన మార్గాలను అన్వేషించుకొని అమలు చేయగల సమర్థవంతమైన నాయకత్వం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నది. ప్రజలను మభ్యపెట్టి, అలవికాని హామీలను గుప్పించి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, ఆ తర్వాత రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపు చర్యలు తీసుకునే అసమర్థ నాయకత్వం కాంగ్రెస్ పార్టీలో ఉన్నది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని పదేండ్ల కాలంలో రాష్ట్ర మత్స్యరంగంలో జరిగిన ప్రయత్నాలు, తీసుకున్న చర్యలు, అమలుపరిచిన పథకాలు... వీటన్నింటి పర్యవసానంగా స్పష్టంగా సాక్షాత్కరిస్తున్న ఫలితాలు ఇప్పుడు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. అయితే, గత ఏడాది కాలంగా రాష్ట్రంలో పరిపాలనా విధ్వంసాన్ని నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న పనితీరుకు తెలంగాణ మత్స్యరంగంలో జరుగుతున్న దుష్పరిణామాలను పరిశీలిస్తే రానున్న మరో నాలుగేండ్ల రాజ్యాంగ బద్ధమైన పదవీకాలంలో ఈ రాష్ట్ర ప్రజల అనుభవంలోకి రానున్న చేదు అనుభవాలను అంచనా వేయడం కష్టసాధ్యంగానే కనిపిస్తున్నది.**

ఉమ్మడి ఏపీ ఉనికి కాలంలో అత్యంత నిరాదరణకు, బుద్ధిపూర్వక నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంత మత్స్యరంగం లక్షల మంది మత్స్యకార కుటుంబాలకు జీవనాధారంగా నిలువలేకపోయింది. ఫలితంగా తరతరాల నుంచి చేపల వేట ప్రధాన వృత్తిగా స్థిరపడిన సంప్రదాయ మత్స్యకార కుటుంబాలు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైతే తమ జీవితాలకు తమ కులవృత్తి ఒక సాంత్వనగా, ఆలంబనగా నిలుస్తుందని ఎన్నో ఆశలు పెంచుకున్నారు. మలిదశ ఉద్యమంలో అమరునిగా నిలిచిన కానిస్టేబుల్ కిష్టయ్య లాంటి అనేక మంది మత్స్యకార సోదరులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. చిన్నతనంలో మత్స్యకార కులానికి చెందిన ముదిరాజ్ తల్లి చనుబాలు తాగి పెరిగినట్టు అనేక సందర్భాల్లో భావోద్వేగంతో ప్రకటించుకున్న కేసీఆర్ తెలంగాణలోని మత్స్యకారుల పట్ల పూర్తి అవగాహనతోనూ, సమస్యల పట్ల సహానుభూతితోనూ వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తొలినాళ్లలోనే మత్స్యకారుల జీవితాలపైనా, మత్స్యరంగాన్ని వారికి జీవనాడిగా మార్చేందుకు గాను తమ ప్రభుత్వం తీసుకోవాలనుకుంటున్న చర్యలపైనా నిండు అసెంబ్లీలో సుమారు గంటపాటు సుదీర్ఘంగా ఆయన ప్రసంగించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రదర్శించిన ఈ ఔదార్యం రాష్ట్రంలోని మత్స్యరంగానికి చెందిన సుమారు 60 లక్షల మంది మత్స్యకారులకు వెయ్యేనుగుల బలాన్ని సమకూర్చింది. ఆ రంగం పట్ల తెలంగాణ సమాజంలో అప్పటివరకు నెలకొని ఉన్న చులకనభావాన్ని పటాపంచలు చేసి గౌరవాన్ని మరింతగా ఇనుమడింపజేసింది. అసెంబ్లీ వేదిక నుంచి మత్స్యరంగ భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రవచించిన అంశాలన్నింటినీ అమలు పరిచి ఫలితాలను సాక్షాత్కరించేందుకు గాను కేసీఆర్ ఎన్నో పథకాలకు శ్రీకారం చుట్టారు.

ప్రపంచవ్యాప్తంగా మేధావి వర్గాలను అబ్బురపరిచి రైతుబంధు పథకాన్ని అమల్లోకి తీసుకురావడానికి రెండేండ్ల ముందుగానే దేశంలోనే మొదటిసారిగా 2016లోనే ఉచిత చేపపిల్లల పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం ఎనిమిది దఫాలుగా ఈ పథకాన్ని ఎంతో ఔదార్యంతో అమలు పరిచారు. ఫలితంగా రాష్ట్రంలో చేపల ఉత్పత్తిలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

> **మత్స్యకార కుటుంబాల్లో ఈ రంగం పట్ల కొడిగట్టుకుపోయిన ఆశలు చిరురించాయి. మత్స్యరంగం తమకు జీవనాధారంగా నిలుస్తుందనే విశ్వాసం మత్స్యకారుల్లో పెరిగింది. గతంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ రంగానికి ఊతమివ్వడం కోసం కాళేశ్వరం లాంటి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ లాంటి బృహత్తర పథకాల అమలు ఫలితంగా చెరువులు, కుంటల్లో ఏడాది పొడవునా నీటి నిల్వ సౌలభ్యం ఏర్పడింది. ఈ కారణంగా నీటి వనరులపైనే పూర్తిగా ఆధారపడిన మత్స్యకారుల ఆదాయం భారీగా పెరిగింది.**

మత్స్యకారులంటే సమాజంలో ఒక గౌరవనీయమైన స్థానం లభించింది. పర్యవసానంగా మత్స్యకార వృత్తి పట్ల నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్న చేపల వృత్తి కులాలకు చెందిన యువతలో మత్స్యకారునిగా గుర్తింపు కావాలనే తాపత్రయం పెరిగింది. ఈ పరిస్థితులకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం రెండున్నర ఎకరాలకు ఒకరికి సభ్యత్వం కల్పించే నిబంధనలను సవరించి ఒక ఎకరానికి ఒకరికి సభ్యత్వాన్ని కల్పించే సాహసోపేతమైన సవరణను అమల్లోకి తీసుకువచ్చింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యే నాటికి రెండున్నర లక్షలుగా ఉన్న మత్స్యకారుల సంఖ్య ప్రభుత్వం సవరించిన నిబంధనల కారణంగా నాలుగు లక్షలకు చేరుకున్నది. మత్స్య సహకార సంఘాల్లో సభ్యులుగా చేర్చుకునేందుకు ప్రభుత్వమే మత్స్యశాఖ ద్వారా రెండు దశల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, కొత్తగా మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడం, వాటిల్లో అర్హులైన యువకులను చేర్చుకునే కార్యక్రమాన్ని నిర్వహించడం దేశవ్యాప్తంగా సంచలనమైంది. కొత్తగా సుమారు రెండు వేల మత్స్య సహకార సంఘాలను ఏర్పాటుచేయడమే కాకుండా, దాదాపు రెండు లక్షల మందికి ఈ సంఘాలలో కొత్తగా సభ్యత్వం కల్పించడం దేశ చరిత్రలోనే ఒక అరుదైన సంఘటనగా నిలిచింది.

దశాబ్దాల తరబడి గ్రామాల్లోని చెరువులు గ్రామ పంచాయతీల ఆధీనంలో ఉండేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీ పరిధి నుంచి చెరువులను తొలగించింది. తద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగయ్యాయి. చెరువులను మత్స్యసహకార సంఘాలకు నేరుగా కేటాయించే విధానాన్ని అమల్లోకి తీసుకురావడంతో ఎంతో ఊరట కలిగింది. అంతేకాకుండా, ఈ చెరువుల కేటాయింపులో స్థానిక రాజకీయ జోక్యానికి కూడా తెరదించడం వల్ల కక్షసాధింపు చర్యలకు ఆస్కారం లేకుండా పోయింది. ఈ పద్ధతిలో రాష్ట్రంలోని దాదాపు 26 వేల గ్రామ పంచాయతీ చెరువులపై స్థానిక మత్స్యసహకార సంఘాలకు అజమాయిషీ లభించింది. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు దానికి అనుబంధంగా నిర్మించిన జలాశయాల్లోనూ ఆ ప్రాంత పరిధిలోని మత్స్యకారులకు లైసెన్స్‌లు జారీచేయడంతో మత్స్యకారులు ఆయా రిజర్వాయర్లలో చేపలు పట్టుకునే హక్కును సాధించారు.

ఒకవైపు కేంద్రం ద్వారా అమల్లోకి వచ్చిన నీలి విప్లవం, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన లాంటి పథకాలను అమలు చేసేందుకు రాష్ట్ర పరిధిలో పటిష్ఠమైన చర్యలు తీసుకుంటూనే, మరోవైపు మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను, మత్స్యసహకార సంఘాలను పటిష్ఠపరిచేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకున్నది. ముఖ్యంగా రూ.1000 కోట్ల భారీ నిధులతో చేపట్టి అమలు జరిపిన సమగ్ర మత్స్య అభివృద్ధి పథకం రాష్ట్రంలోని సుమారు లక్షా ముప్పై వేల మంది మత్స్యకార కుటుంబాలకు అందుబాటులోకి వచ్చింది. ఇందులో సుమారు 63 వేల ద్విచక్ర వాహనాలు (మోపెడ్స్) పంపిణీ చేయడం తెలంగాణలోని మత్స్యకారుల్లో ఉత్సాహపూరితమైన వాతావరణాన్ని కల్పించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా తానే పూచీకత్తుగా నిలిచి జాతీయ సహకార ఆర్థిక సంస్థ ద్వారా వెయ్యి కోట్ల భారీ రుణాన్ని సేకరించి మరీ ఈ పథకాన్ని అమలు చేసింది.

> **తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం పూర్వపు 10 జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో జిల్లా స్థాయి మత్స్య సహకార సంఘాలను సైతం విస్తరించేందుకు గాను నాటి ప్రభుత్వం పూనుకొని ఆ దిశగా అడుగులు వేసింది. కొత్త జిల్లాలతో పాటుగా పూర్వపు జిల్లాల్లోనూ కొత్తగా మత్స్య సహకార సంఘాలను అధికారికంగా నమోదు చేయించేందుకు జిల్లా స్థాయిలో తాత్కాలిక కమిటీలను ఏర్పాటుచేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశారు.**

తదనంతర చర్యగా జిల్లా స్థాయి మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకూ చర్యలు తీసుకున్నది. ఈ తతంగాలను పూర్తిచేసేందుకు రాష్ట్ర స్థాయి ఫిషరీస్ ఫెడరేషన్‌కు తాత్కాలిక పద్ధతిలో చైర్మన్, వైస్ చైర్మన్లను నియమించి మత్స్య రంగంలో సహకార చట్టం నిబంధనలకు అనుగుణంగా సమాఖ్య స్ఫూర్తిని నిలబెట్టేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. రాష్ట్రంలో మహిళా మత్స్యకారుల్లో ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు, మహిళా సాధికారికతను సాధించేందుకు మహిళా మత్స్యకార సొసైటీల ఏర్పాటును ప్రోత్సహించారు. అదేవిధంగా మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వ నిబంధనల ప్రకారం సభ్యత్వం లభించని ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు మత్స్య మార్కెటింగ్ సొసైటీల ఏర్పాటును కూడా ప్రోత్సహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ మత్స్యరంగంలో ఏదో ఒక పద్ధతిలో అవకాశాలను కల్పించేందుకు అంతకుముందున్న నిబంధనలను సరళీకృతం చేసింది. ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో అదనంగా సుమారు రెండు వేల మేరకు నూతన మత్స్య సహకార, మత్స్య మహిళా, మత్స్య మార్కెటింగ్ సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. వీటిల్లో దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులకు అదనంగా సభ్యత్వం లభించడంతో పాటుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకువచ్చే పథకాలన్నింటికీ అర్హత లభించింది.

తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలిసారి గత సంవత్సరంలో మూడురోజుల పాటు ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఫిష్ ఫుడ్ ఫెస్టివల్స్ కారణంగా ఔత్సాహిక మత్స్యకారులకు ప్రోత్సాహం లభించింది. సుమారు ఆరేండ్ల కిందట వనపర్తి జిల్లా పెబ్బేరులో పీవీ నర్సింహారావు వెటర్నరీ వర్సిటీకి అనుబంధంగా ఏర్పాటు చేసిన ఫిషరీస్ కళాశాల విజయవంతంగా నడుస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.12 కోట్లతో మేడ్చల్‌లో నిర్మించిన మత్స్యకార వృత్తి శిక్షణా సంస్థ ఒక ఆదర్శ కేంద్రంగా నిలిపేందుకు అవకాశాలున్నాయి. అయితే అన్ని రకాలుగా సంసిద్ధమై ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఈ శిక్షణా సంస్థను ఉపయోగంలోకి తీసుకురావాలనే సోయి నేటి ప్రభుత్వానికి లేకపోవడం విడ్డూరం. రాష్ట్రంలో మత్స్యకారుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిలువెత్తు నిదర్శనం. ఇక గత ప్రభుత్వ హయాంలో అమలైన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని నీరుగార్చేందుకు గాను ఇప్పటి ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. అందుకేనేమో పంపిణీ చేయవలసిన చేపపిల్లల పరిమాణాన్ని సగానికి తగ్గించింది. ఈ సగం పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ఇంకా పూర్తి చేయకపోవడం బాధాకరం. ఈ విషయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు తమ ప్రభుత్వ నిర్వాకం మీద మీడియా ముఖంగా విరుచుకుపడ్డారు. చెరువుల్లో చేప పిల్లలను వదలకుండా కార్యక్రమాన్ని బహిష్కరించి ఆయన వెళ్లిపోవడం లాంటి విపరిణామాలు తెలంగాణ మత్స్యరంగం పట్ల, ఆ రంగం మీద ఆధారపడిన 4 లక్షల పైచిలుకు మత్స్యకార కుటుంబాల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిదర్శనం.

**(వ్యాసకర్త: 'ఫిషరీస్ ఫెడరేషన్' మాజీ చైర్మన్, 'తెలంగాణ ఫిషరీస్ సొసైటీ' వ్యవస్థాపక అధ్యక్షులు, 'ఏషియన్ ఫిషరీస్ సొసైటీ' సభ్యులు)**

(నేడు ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం)

# సంప్రదింపులు లేని ప్రజాపాలన

డాక్టర్ వి.వి.రామారావు
98492 37663

**అడవులు నరికి జంతువులను నిర్వాసితులను చేయరాదని మహాభారతం చెప్తుంది. ఈ రాజనీతిని నేటి పరిస్థితులకు అన్వయించుకుంటే ఒకరి కడుపు కొట్టి మరొకరి కడుపు నింపొద్దని అర్థం. ప్రైవేటైనా, ప్రభుత్వమైనా సరే చట్టం, న్యాయం అందరికీ సమానమే. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోని పదికరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న నిర్ణయం ఇలాంటిదే. అంబేద్కర్ వర్సిటీ కడుపు కొట్టి జేఎన్ఏఎఫ్ఏయూ కడుపు నింపాలనుకోవడం సరికాదు.**

ఆచార్య జి.రామిరెడ్డి మేధో పుత్రిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం. 1982లో దీన్ని స్థాపించారు. మన దేశంలో దూరవిద్య విధానాన్ని మొట్టమొదట ప్రవేశపెట్టిన ఘనత ఈ విశ్వవిద్యాలయానిదే. ఒకసారి సింహావలోకనం చేసుకుంటే కొఠారి కమిషన్ నివేదికను అనుసరించి ఓపెన్ యూనివర్సిటీ మౌలిక భావన గురించి 1978లోనే ఉస్మానియాలో పనిచేస్తున్న ప్రొఫెసర్ జి.రామిరెడ్డి, ప్రొఫెసర్ వీఎస్ ప్రసాద్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హరగోపాల్ మొదలైనవారితో కూడిన మేధావివర్గం నాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. అప్పటి విద్యాశాఖ మంత్రి భవనం వెంకట్రాం యూనివర్సిటీ ప్రతిపాదనకు సుముఖత వ్యక్తం చేశారు. 1982లో ముఖ్యమంత్రి హోదాలో భవనం వెంకట్రాం సంబంధిత తీర్మానాన్ని అసెంబ్లీలో ఆమోదింపజేశారు. ఆ తర్వాత కేంద్రం, యూజీసీ అనుమతులు వచ్చాక నాగార్జునసాగర్ కేంద్రంగా రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించారు. అదే ఏడాది నవంబర్‌లో దీన్ని పంజాగుట్టకు తరలించారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటీ పేరిట ప్రారంభమైన ఈ వర్సిటీకి ఆచార్య జి.రాంరెడ్డి తొలి వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు.

దుర్గం చెరువు సమీపంలో 53 ఎకరాల స్థలాన్ని ఎన్టీ రామారావు ప్రభుత్వం ఆ యూనివర్సిటీకి కేటాయించింది. 1988, జూలై 2న అప్పటి ఉప రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ భవన సముదాయాలకు శంకుస్థాపన చేశారు. 1991 లో అంబేద్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా పేరు మార్చారు. 1992 ఆగస్టు 31న అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు చేతులమీదుగా నూతన భవనాల ప్రారంభోత్సవం జరిగింది. చిన్న నీటి బిందువుగా పుట్టిన ఈ యూనివర్సిటీ క్రమంగా మహాసాగరంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దీని పరిధిలో 218 విద్యాకేంద్రాలు ఉండటం గమనార్హం.

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ యూనివర్సిటీ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. 2023లో న్యాక్ 'ఎ' గ్రేడ్ రావడం వెనుక కేసీఆర్ సర్కార్ కృషి దాగి ఉన్నది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ వర్సిటీ పరిధిలో ప్రస్తుతం లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులెందరో ఈ వర్సిటీ నుంచి వచ్చారు. ప్రముఖ నటి, మిస్ ఆసియా దియా మీర్జా, రచయిత్రి, ఉద్యమకారిణి గోగు శ్యామల, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రమేశ్ కార్తీక్ నాయక్‌తో పాటు ఎందరో ప్రముఖులు ఇక్కడే డిగ్రీ పట్టాలు పొందారు.

ఓపెన్ యూనివర్సిటీతో పోలిస్తే జేఎన్ఏఎఫ్ఏయూ పరిధి చాలా తక్కువ, కోర్సులూ తక్కువే. అందులో లలిత కళలు, నిర్మాణానికి సంబంధించిన కోర్సులు మాత్రమే బోధిస్తారు. లలిత కళలకు తెలుగు యూనివర్సిటీతోనే ఎక్కువ సంబంధం ఉంటుంది. తెలుగు యూనివర్సిటీకి ప్రస్తుతం బాచుపల్లిలో 100 ఎకరాలు, నాంపల్లిలో 13 ఎకరాల స్థలం అందుబాటులో ఉన్నది. కానీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి 30 ఎకరాల స్థలం కూడా అందుబాటులో లేదు. అందులోనూ గుట్టలు, లోయలే ఎక్కువగా ఉన్నాయి. ఈ స్థితిలో తాను దూరం సందు లేదు మెడకేమో డోలు అన్నట్టుగా జేఎన్ఏఎఫ్ఏయూకి పదికరాలు కేటాయించడం దారుణం.

> **జేఎన్ఏఎఫ్ఏయూకి స్థలం కేటాయించాలనుకుంటే ఎన్నో మార్గాలున్నాయి. స్కిల్, స్పోర్ట్స్ యూనివర్సిటీ లాగానే వేరే ప్రాంతంలో స్థలం కేటాయించవచ్చు. నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీ పాత భవనాలు ఖాళీగానే ఉన్నాయి. లేదా బాచుపల్లిలోని వంద ఎకరాల్లో ఇరవై ఎకరాలు కేటాయించినా అభ్యంతరం లేదు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవసరాలకే స్థలం చాలా తక్కువగా ఉన్న పరిస్థితుల్లో ఇతర సంస్థలకు కేటాయించడం సబబు కాదు. ఇది విద్యకు నోచుకోని పేదలు, బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేయడమే.**

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ భూములను జేఎన్ఏఎఫ్ఏయూకి కేటాయిస్తూ తెలంగాణ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి విద్యార్థులు, ఉద్యోగ వర్గాలు ఆందోళనలో ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై పోరాడేందుకు గానూ ప్రొఫెసర్ శ్రీనివాస్ వడ్డాణం సమన్వయకర్తగా జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటైంది. జేఏసీ ఆధ్వర్యంలో ప్రతిరోజు విరామ సమయంలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. జాక్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, జనరల్ సెక్రెటరీ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొంటున్నారు. అందులో భాగంగా రాస్తారోకో, వంటా వార్పు, ర్యాలీ, నిరాహార దీక్ష, యూనివర్సిటీ బంద్ వంటి కార్యక్రమాలను గత 55 రోజులుగా నిర్వహిస్తున్నారు. అయినా ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదు. ఓపెన్ యూనివర్సిటికీ ఐదెకరాలే చాలని, యూనివర్సిటీ సిబ్బంది, ఉద్యోగులు ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎం వీ రమణారెడ్డి చెప్పడం హాస్యాస్పదం. జేఎన్ఏఎఫ్ఏయూకి నగరం నడిబొడ్డునే స్థలం కావాలంటే నాంపల్లిలో తెలుగు యూనివర్సిటీ భవన సముదాయమే సరైనది.

ప్రజా ప్రయోజనాల పేరిట జారీచేసే ప్రభుత్వ నోటీసులను, ఫర్మానాలను సుప్రీంకోర్టు ఇటీవల తప్పుబట్టిన విషయాన్ని మరిచిపోకూడదు. ఒక సంస్థకు ఇచ్చిన స్థలాన్ని వేరొక సంస్థకు ఇవ్వడమనేది అంత సులువు కాదు. హైడ్రా ద్వారా బుల్డోజర్‌తో ఇండ్లు కూల్చడమంత తేలిక కాదు. అందులో ఎన్నో చట్టపరమైన, న్యాయపరమైన అంశాలుంటాయి. 'మేం తలచుకొంటే ఏదైనా చేస్తాం' అనేది వారి వారి ఆత్మవిశ్వాసాన్ని కాదు, అహంకారాన్ని తెలుపుతున్నది. ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది తమ బాగోగులు చూస్తారని. అంతేకానీ, ఇష్టమొచ్చిన నిర్ణయాలు తీసుకోవడానికి కాదు. తాము ఏ నిర్ణయం తీసుకున్నా, ఏం చేసినా చెల్లుతుందనుకోవడం మూర్ఖత్వమే. ప్రజాపాలనలో సలహాలు, సంప్రదింపులు లేకపోవడం విడ్డూరం. ఇతరుల సలహా, సూచనలు ప్రజల శ్రేయస్సు కోరేవే అయినా.. కొన్నిసార్లు అవి వికటిస్తాయి. అందుకే..

> 'వినదగు నెవ్వరు చెప్పిన
> వినినంతనె వేగ పడక
> వివరింపదగున్
> గని కల్ల నిజము దెలిసిన
> మనుజుడెపో నీతిపరుడు
> మహిలో సుమతీ!'

అన్నాడో మహానుభావుడు.

**(వ్యాసకర్త: సామాజిక, సాంస్కృతిక విశ్లేషకులు)**

**అజర్‌బైజాన్‌లోని బాకులో 